



నేరడిగొండ మండలం తేజాపూర్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ పదోన్నతులు వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న సామ్యూల్

ఆదిలాబాద్‌టౌన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సామ్యూల్ డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నష్టం జరగకుండా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అలాగే 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు నాయం చేయాలన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై బజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, బి.వృకోధర్, నాయకులు నాగేందర్, ఉదారి నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్. సుధాకర్, ప్రేంసింగ్, దిలీప్, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో జిల్లా ప్రతినిధులు



పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: టీఎస్ యూటీఎఫ్ సంఘం రాష్ట్ర మహాసభలు రంగారెడ్డి జిల్లాలోని సార్థా కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్నాయి. శనివారం ఆదిలాబాద్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. విద్యారంగంపై జరిగిన చర్చలో పాల్గొని, పలు తీర్మాణాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులుగా ఎ. స్వామి, అశోక్, సురేఖ, సూర్యకుమార్, కిష్టన్న, విఠల్ గౌడ్, శ్యాంసుందర్, శివన్న పాల్గొన్నారు.

త్వరలో సమత సైనిక్‌దళ్ యూనిట్



మాట్లాడుతున్న బాబా సాహెబ్‌కాంబ్లే

ఎదులాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏర్పాటు చేసిన మాతృత్వశాఖ సమత సైనిక్‌దళ్ యూనిట్‌ను ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబాసాహెబ్ కాంబ్లే తెలిపారు. స్థానిక కైలాస్‌నగర్‌లోగల అశోక బుద్ధవిహార్‌లో దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. త్వరలో సమత సైనిక్‌దళ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాంబ్లేశ్ చౌదంతే, దళిత సంఘాల నాయకులు రవికిరణ్, రాజుదాండ్లే, దాదా సాహెబ్ జబాడే, శైలేందర్ వాఘ్మారే, శాలిక్‌రావు, కుష్వర్తబాయి, శోభతాయి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గును తీర్చిదిద్దుతున్న చిన్నారి



గాలిపటాలు ఎగురవేస్తూ..



జిల్లా కేంద్రంలోని ఓ ఇంటి వద్ద తీర్చిదిద్దిన ముగ్గు ..

సంక్రాంతి వచ్చిందోచ్

జిల్లావ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు

సంబరాల సంక్రాంతి వచ్చేసింది. మూడు రోజుల పండుగలో భాగంగా తొలిరోజు శనివారం భోగి వేడుకలను జిల్లా వాసులు ఘనంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు చేరిన జనంతో పల్లె, పట్టణం పండుగ శోభ సంతరించుకుంది. మహిళలు వేకువజామునే ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. సంప్రదాయం ప్రకారం పిల్లలకు భోగి పండ్లు పోసి స్నానాలు చేయించారు. చిన్నారులు గాలిపటాలతో సందడి చేయగా.. సాయంత్రం కూడళ్లలో భోగిమంటలు ఆకర్షణంగా నిలిచాయి. నేడు సంక్రాంతి, రేపు కనుమ వేడుకలకు అందరూ సిద్ధమయ్యారు.

– ఆదిలాబాద్



భోగి పండ్లు పోస్తున్న చిన్నారి



కల్యాణోత్సవంలో పాల్గొన్న డీఎస్పీ ఉమేందర్ తదితరులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్యాణం.. కమనీయం

జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయం (మార్వాడి ధర్మశాల)లో శనివారం శ్రీగోదాదేవీ రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణ తంతును నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. డీఎస్పీ ఉమేందర్ హాజరై పూజలు చేశారు. అలాగే పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల శ్రీరామమందిరంలో సైతం గోదాదేవి రంగనాథ కల్యాణోత్సవం నిర్వహించారు. ధనుర్మాసంలో నెల పాటు జరిగే అండాల్ అమ్మవారి తిరుప్పావై పశురాల పఠనం అనంతరం గోదాదేవీ కల్యాణంతో ధనుర్మాస వ్రతం ముగుస్తుందని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం అర్చకులు సునీల్‌కుమార్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, ప్రఫుల్ వర్ఘే, గేదం మాధవ్, ఉన్నారు. – ఆదిలాబాద్



శ్రీరామాలయంలో గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు

బీజేపీ బలగం పటిష్టమేనా..?



ఆదిలాబాద్‌లో బీజేపీ వర్చువల్ సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, పోలింగ్‌బూత్ సభ్యులు (ఫైల్)

- పోలింగ్ బూత్ కమిటీల్లో లోపాలు
- ఇటీవల వర్చువల్ మీటింగ్‌లో నామమాత్రంగా సభ్యుల హాజరు

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికలు ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉండగా, బీజేపీ బలగం పటిష్టమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. పోలింగ్ బూత్ కమిటీల్లో లోపాలు బహిర్గతం అవుతున్నాయి. ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వర్చువల్ మీటింగ్ ద్వారా పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం కాగా, జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో సభ్యుల హాజరు నామమాత్రంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా ఉండాల్సిన సభ్యుల సంఖ్య పావు వంతు లోపే ఉండడంతో డొల్లాతనం బహిర్గతం అవుతుంది.

పోలింగ్ బూత్ కమిటీలపై ఫోకస్..

బీజేపీ అధిష్టానం పోలింగ్ బూత్ కమిటీలపై దృష్టి పెట్టింది. నియోజకవర్గంలో ఒక్కో పోలింగ్ కేంద్రానికి సంబంధించి బూత్ కమిటీల పరంగా 22 నుంచి 25 మంది సభ్యులు ఉండాలి. అదేవిధంగా 300 మంది ఓటర్లకు సంబంధించి ప్రతి 60 మందికి ఒక పన్నప్రముఖ్‌ను నియమించాలి. తద్వారా ఎన్నికల్లో ప్రతి ఓటర్‌పై పార్టీ సభ్యుడు దృష్టి సారించాలనేది అధిష్టానం ఆలోచన. దీంతోనే ఆ పార్టీ జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా బూత్ కమిటీల పటిష్టతపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఈనెల 7న రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం నియోజకవర్గం వారీగా నిర్వహించారు. వర్చువల్ విధానంలో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పోలింగ్ బూత్ కమిటీ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే ఒక మిస్డ్‌కాల్‌తో బూత్ కమిటీల రిజిస్ట్రేషన్లను చేపట్టారు. తద్వారా వీటిపై అధిష్టానం ఎంతగా దృష్టి పెట్టిందనేది స్పష్టమవుతుంది.

పటిష్టమేనా..

జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి కొంత భాగం జిల్లాలో ఉంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరంగా బీజేపీ బూత్ కమిటీలను పరిశీలిస్తే.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ లెక్కన 6వేలకు పైగా, బోథ్ నియోజకవర్గంలో 301 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఆరు వేల ఐదు వందలకు పైగా సభ్యులు ఉండాలి. వర్చువల్ సమావేశంలో ఆదిలాబాద్‌కు సంబంధించి వెయ్యి మంది సభ్యుల వరకు హాజరైనట్టు చెబుతున్నారు. బోథ్ పరంగా నామమాత్రంగా ఐదు వందల లోపే ఉన్నట్లు పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. దీంతో పోలింగ్ బూత్‌ల పటిష్టతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. అధిష్టానం మిస్డ్ కాల్ ద్వారా రిజిస్ట్రేషన్ నిర్వహించడంతో స్థానికంగా లోపాలపై వారికి స్పష్టత వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అంగన్‌వాడీల బలోపేతంపై దృష్టి

- సేవలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు
- ఇప్పటికే డిగ్రీ అర్హతగా సూపర్‌వైజర్ల ఎంపిక
- తాజాగా టీచర్, హెల్పర్ పోస్టుల విద్యార్హత ఇంటర్‌కు పెంపు

సాక్షి,ఆదిలాబాద్: అంగన్‌వాడీల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. సేవలను మెరుగుపరిచే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ వ్యవస్థలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశించిన ఫలితాలను క్షేత్రస్థాయిలో సాధించడంలో వీరే కీలకం. ఈక్రమంలో సర్కార్ వీరి సామర్థ్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందించడంపై దృష్టి సారించింది. ప్రధానంగా మిషన్ పోషణ్ 2.0 ఫలితం సాధించాలంటే వీరితోనే సాధ్యం. ఇందులో భాగంగా వీరి నియామక ప్రక్రియను అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పటికే సూపర్‌వైజర్ల నియామకాలను ఇంటర్మీడియెట్ నుంచి డిగ్రీకి పెంచారు. తాజాగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఎంపికకు కూడా అర్హతను పదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్‌కు పెంచారు.

ఉన్నత లక్ష్యాలు..

అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం ప్రధానంగాగర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుంది. అలాగే ఆరేళ్లలోపు పిల్లలకు ఆటాపాటలతో కూడిన ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ అందిస్తుంది. ఈ నేపథ్యంలోనే వాటి సేవలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఇటీవల అంగన్‌వాడీ టీచర్ల నుంచి గ్రేడ్–2 సూపర్‌వైజర్ పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. ఇదివరకు ఇంటర్మీడియెట్ ఉన్నవారిని ఈ పదోన్నతులకు అర్హులుగా భావించేవారు. దీన్ని డిగ్రీకి పెంచి ఇటీవల ఈ ప్రక్రియ పూర్తి చేశారు. తాజాగా ప్రభుత్వం ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో వాటి అర్హతలను కూడా సవరించింది. ఇదివరకు పదో తరగతి అర్హత ఉన్నవారిని పరిగణలోకి తీసుకోగా, ఇకపై ఇంటర్ కనీస అర్హతగా గుర్తిస్తున్నారు. తద్వారా తాము ఉద్దేశించిన లక్ష్యాలు సాధనకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

వెయిటేజీ ఇలా..

అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల ఎంపికకు ప్రభుత్వం వెయిటేజీ ప్రకటించింది. మెరిట్ మార్కులు ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. వంద మార్కులకుగాను మెరిట్ ఉన్నవారికి 80 మార్కులు ఇవ్వనున్నారు. వితంతువులకు 5 మార్కులు, అనాథలకు 10 మార్కులు, దివ్యాంగులకు 5 మార్కులు కేటాయించారు. ఇందులో ఎక్కువ మార్కులు ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించనున్నారు. ఇదిలా ఉంటే ఈ పోస్టుల ఎంపికలో గతంలో మాదిరిగానే కమిటీలు పనిచేయనున్నాయి. మైదాన ప్రాంతాల్లో కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, ఆర్డీఓ, డీఎంహెచ్ఓ/ఏడీఎంహెచ్‌వోలు సభ్యులుగా, జిల్లా సంక్షేమ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, ఆర్డీవో, ఐటీడీఏ పీవో, డీఎంహెచ్‌వో/ఏడీఎంహెచ్ఓలుసభ్యులుగా వ్యవహరిస్తారు. జిల్లా సంక్షేమ అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. మొత్తంగా ఖాళీగా ఉన్నటువంటి అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధమైంది. ఇదిలా ఉంటే హెల్పర్ పోస్టుల్లో ఇంటర్మీడియెట్ అర్హత ఆధారంగా దొరకని పక్షంలో ఆ తర్వాత పదో తరగతి ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించనున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాలు దిద్దుతున్న చిన్నారులు (ఫైల్)

కొత్త మార్గదర్శకాలు వచ్చాయి

అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల నియామకాల్లో ఇంటర్మీడియెట్‌ను కనీస అర్హతగా చేశారు. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం మార్గదర్శకాలైతే వచ్చాయి. నోటిఫికేషన్ రావాల్సి ఉంది.

– మిల్కా, జిల్లా సంక్షేమ అధికారి

జిల్లాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..

జిల్లా	ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య
ఆదిలాబాద్	ఆదిలాబాద్‌అర్బన్, బోథ్, జైనథ్, నార్నూర్, ఉట్నూర్	1256
కుమురంభీం	ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్(యు), సిర్పూర్, వాంకిడి	973
మంచిర్యాల	బెల్లంపల్లి(యు), చెన్నూర్, లక్సెట్టిపేట్, మంచిర్యాల	969
నిర్మల్	భైంసా, ఖానాపూర్, ముథోల్, నిర్మల్	926

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

బోథ్: మండల కేంద్రంలోని లాల్‌పిచ్‌లో సోయం యువసేన, వెపన్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎంపీ సోయం బాపూరావ్ శనివారం ప్రారంభించారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, రైల్వేబోర్డు సభ్యులు జీవీ రమణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమేష్, సూర్యం పాల్గొన్నారు.



టాస్ వేస్తున్న ఎంపీ సోయం బాపూరావ్, పక్కన కంది శ్రీనివాస్, బలరాం జాదవ్

బామ్ని(కె)కు చేరిన మృతదేహం

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన గొల్ల రాజు(39)అబుదాబిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. గొల్ల రాజును విగత జీవిగా చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

ఎదురొస్తున్న ప్రమాదం..!

- ఎదురెదురుగా ఢీకొంటున్న ద్విచక్ర వాహనాలు
- వేగం వల్ల గాల్లో కలుస్తున్న ప్రాణాలు



భీంపూర్ మండలం లక్ష్మీపూర్ వద్ద జరిగిన ప్రమాద స్థలంలో క్షతగాత్రులు(ఫైల్)

సాక్షి, మంచిర్యాలడెస్క్: ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి ప్రమాదం ఎదురొస్తోంది. అతివేగం, మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోవడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. గత డిసెంబర్ 25న ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు సంఘటన స్థలంలోనే మృత్యువాత పడడం, మరొకరు ఆస్పత్రిలో చనిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ప్రమాదాల్లో మృతుల సంఖ్యతోపాటు గాయపడుతున్న వారూ అధికంగానే ఉంటున్నారు.

హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనల్లో చాలామంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జరిగింది. రాంగ్‌రూట్‌లో వెళ్లడం, మూలమలుపులు, మద్యపానం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో గత ఏడాది కాలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 3,288మందికి పోలీసులు జరిమానా విధించారు. రూ.4.81లక్షలు జరిమానా రూపంలో వసూలైంది. నిర్మల్ జిల్లాలో హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 1,49,621 మందికి రూ.2,24,43,150 జరిమానా విధించారు. ఆదిలాబాద్ జిల్లాలో 2,307 మందికి జరిమానా విధించి రూ.1,17,232 వసూలు చేశారు. జిల్లాలో పోలీసులు 13బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. నేరడిగొండ మండలం కుప్టి, నేరడిగొండ సమీపంలోని దాబాల వద్ద, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలం పులిమడుగు, జైనథ్ మండలం భోరజ్, మావల సమీపంలోని బైపాస్, దేవాపూర్ చెక్‌పోస్టు తదితర ప్రాంతాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు..

- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై గత జూలై 11న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. హాజీపూర్ గ్రామానికి చెందిన మల్యాల వంశీ(20) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఈ ప్రమాదంలో వంశీ మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇదే ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకులు చింతకింది శ్రీధర్, అలిశెట్టి రవిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందినవారు.
- తాంసి మండలం హస్నాపూర్ గ్రామ సమీపంలో డిసెంబర్ 25న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఘటన స్థలంలోనే నలుగురు మృతిచెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.. సుజిత్‌రామ్(38), మనీషా(11), నారాయణ(30), సంస్కార్(11) మృతిచెందారు. వందన అనే మహిళ గాయపడింది. ఈ ప్రమాదంలో బైక్ ప్రయాణిస్తున్న వారు హెల్మెట్లు ధరించలేదు.
- జనవరి 9న భీంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గుబిడిపల్లెకు చెందిన చిర్ర మల్లన్న, రాజారాం, మహారాష్ట్రలోని కొఠారికి చెందిన రంజిత్ చౌహాన్, రమేష్‌యాదవ్ గాయపడ్డారు.
- జనవరి 9న ముథోల్ మండలం టాక్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన సాయిలు(35) అక్కడికక్కడే మృతిచెందాడు. నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన రాజశేఖర్ గాయపడ్డాడు.
- ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడ సమీపంలో గత ఏడాది ఫిబ్రవరి 28న రెండు ద్విచక్ర వాహనాల ఎదురెదురుగా ఢీకొని గుండవేణి ప్రసాద్ గాయపడ్డాడు. అక్టోబర్ 20న రాంపూర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో కాల్వ మల్లేష్ గాయపడ్డాడు. మే 20న జరిగిన ప్రమాదంలో షేక్ ఆరీఫ్(50) మృతిచెందాడు. వీరి వాహనాలకు ఎదురుగా వాహనాలపై వచ్చిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
- జనవరి 10న మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాలపై ఎదురెదురుగా వస్తున్న బాసర గ్రామానికి చెందిన శివ తీవ్రంగా, మహారాష్ట్రకు చెందిన సంక్షేణ స్వల్పంగా గాయపడ్డారు.

హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలి



మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. యువత చైతన్యంతో నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మితిమీరిన వేగం, నిబంధనలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే పోలీసు, రవాణా శాఖల సమన్వయంతో రెడ్ జోన్, బ్లాక్‌స్పాట్స్ గుర్తించడంతోపాటు మూలమలుపులు, ఇరుకు వంతెనల వద్ద జాగ్రత్తలు సూచించాం. వాహనదారులు జాగ్రత్తలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో జాగ్రత్తలు సూచించాలి. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనల్లో హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు పాటించాలి.

– ఎల్.కిష్టయ్య, జిల్లా రవాణాశాఖా అధికారి, మంచిర్యాల

ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ద్విచక్ర వాహనాలతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపిస్తుండడంతో ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో గుర్తించేలా ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల వెనుక రేడియం వేయించేలా చూస్తున్నాం. ఆదిలాబాద్ పట్టణంలో రోడ్లపై పశువుల సంచారంతో కూడా ప్రమదాలు జరుగుతున్నాయి. గత పది రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతో ప్రమాదాలు జరగడలేదు. నిబంధనలు పాటించని 300 మందిపై కేసులు నమోదు చేశాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ

కడెంలో పర్యాటకుల సందడి



కడెం: సంక్రాంతి సెలవులతో కడెం ప్రాజెక్ట్ పరిసరాలు శనివారం పర్యాటకులతో సందడిగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రాజెక్ట్ అందాలను వీక్షించి, బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్



మాట్లాడుతున్న పట్టణ సిఐ శ్రీనివాస్

నిర్మల్‌చైన్‌గేట్: గుట్టు చప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని నిర్మల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేట్ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నోమన్ అలియాస్ రమీజ్ కొంతకాలంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించి అతడిని పట్టుకున్నారు. రమీజ్ బ్యాంకు అకౌంటు, ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేయగా నిర్మల్ పట్టణానికి చెందిన సల్మాన్, భైంసాకి చెందిన దత్తు, అనీస్ ఇర్ఫాన్ సహకారంతో క్రికెట్, ఇతర ఆటలపై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. దీంతో మహమ్మద్ అబ్దుల్ నోమన్ అలియాస్ రమీజ్, సల్మాన్ భైంసాకు చెందిన దత్తు, అనీస్, ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి

ఇచ్చోడ: ఇంట్లో నిలువ చేసిన పత్తి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన మండలంలోని ఇస్లాంనగర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గౌసొద్దీన్ అనే రైతు తాను పండించిన పత్తిని ఇంట్లో నిల్వచేశాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కరెంట్ స్విచ్ వేయడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ మీటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు లేచాయి. నిల్వ చేసిన పత్తికి అంటుకోవడంతో సుమారు ఐదు క్వింటాళ్ల వరకు దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపాడు.

16న రాష్ట్ర స్థాయి సమావేశం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఈ నెల 16న ఉట్నూర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉన్నత స్థాయి ఉద్యోగులు, హైదరాబాద్, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నిజామబాద్, జిల్లాల నుంచి హాజరవుతారని, పర్ధాన్ ఉద్యోగుల సంఘం బలోపేతం చేయడం, భవిష్యత్‌లో సంఘం నిర్వహించే కార్యక్రమాలు, సమాజానికి చేయాల్సిన సేవ వంటి ముఖ్యమైన ఏజెండాతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముథోల్: మండల కేంద్రంలోని కంటి దవాఖాన సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన అబ్దుల్ రషీద్ భైంసా నుంచి ద్విచక్రవాహనంపై ముథోల్ వైపు వెళ్తుండగా భైంసా నుంచి ముథోల్‌కు వస్తున్న ఆటో కంటి దవాఖాన వద్ద ఢీ కొట్టింది. దీంతో రషీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

వివాహిత బలవన్మరణం

నస్పూర్: పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన వివాహిత సాయివినూత్న(22) బలవన్మరణానికి పాల్పడింది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లడ్ కాలనీకి చెందిన సాయి వినూత్నకు దేవాపూర్‌కు చెందిన సాయితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దికాలం తర్వాత భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో గత నవంబర్‌లో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. కొంతకాలంగా సాయి వినూత్న ఇంట్లో ఒంటరిగా, ముభావంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లోని బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి వినోద్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



పార్వతి బాయిని 108లో రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ధర్లొద్దీ గ్రామానికి చెందిన వివాహిత పార్వతి బాయి (23) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికుల కథనం ప్రకారం.. పార్వతి బాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా ఈఎంటీ కార్తీక్‌సింగ్, పైలేట్ రాములు ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

భీమారంలో డిగ్రీ విద్యార్థి ..

భీమారం: మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి చింతపూడి అంజి(20) శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంట్లో గొడవపడి అకస్మాత్తుగా క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు స్పందించి పురుగుల మందు బయటకు వచ్చేలా సర్ఫ్ నీళ్లు తాగించారు. అనంతరం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.



హరిహర క్షేత్రంలో మకరజ్యోతి దర్శనం

పట్టణంలోని మల్లన్నగుట్ట హరిహర క్షేత్రంలో శనివారం అయ్యప్ప మకరజ్యోతి దర్శనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి తిరు ఆభరణాలను మేళతాళాల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో తిరు ఆభరణాలకు స్వాగతం పలికారు. అనంతరం అయ్యప్ప ఆలయం వద్ద ఉత్సవ విగ్రహాలు, మూలవిరాట్టును ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మకరజ్యోతి దర్శనం గావించారు. భక్తుల శరణుగోషతో మల్లన్నగుట్ట మార్మోగింది. కార్యక్రమంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త అల్లోల వినోద మురళీధర్‌రెడ్డి, గురుస్వాములు, అర్చకులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. – నిర్మల్‌చైన్‌గేట్



